క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా మంగళవారం 11కేవీ మన్సూరాబాద్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె. రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఎంపీ రంజిత్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మీర్‌పేట: పట్టణ పరిధిలోని జిల్లెలగూడలోని పోచమ్మ దేవాలయ పునర్నిర్మాణానికి చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి రూ.6 లక్షలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఎంపీని ఆయన నివాసంలో కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చలువాది రాజేష్, మధుసూదన్‌రెడ్డి, బొబ్బిలి కిరణ్‌గౌడ్, మల్లెల నరేందర్‌రెడ్డి, సప్పిడి యాదిరెడ్డి, కుంటల వల్లభ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి

పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



తుక్కుగూడలో బీజేపీ ఇంటింట ప్రచారం

తుక్కుగూడ: బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి ప్రకటించారు. సోమవారం మహాజన్ సంపర్క్ యోజన కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ కేంద్రంలోని 'ఇంటింటా బీజేపీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, అభివద్ధిని ప్రజలకు వివరించామని తెలిపారు. బీజేపీ శ్రేణులు ఇంటింటికీ తిరిగి కేంద్ర ప్రభుత్వ పనితీరుపై ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్, రాష్ట్ర మీడియా కన్వీనర్ సుధాకర్ శర్మ, రచ్చ లక్ష్మణ్, నాయకులు పాపయ్యగౌడ్, సుధాకర్, శ్రీనివాస్ నాయక్, వెంకటేష్‌గౌడ్, నర్సింహ్మా, తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి గృహానికి రూ.25 వేల విరాళం

దిల్‌సుఖ్‌నగర్: అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ముద్దం గౌతమ్ రెడ్డి జన్మదిన వేడుకలను అతని అత్తమామలు సోమవారం ఆర్‌కేపురంలో అనాథ విద్యార్థి గృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్ రెడ్డి తన మామ మహేందర్‌రెడ్డి ద్వారా విద్యార్థి గృహం విద్యార్థులకు 2023–24 విద్యా సంవత్సరంలో అవసరమయ్యే టెక్స్‌బుక్స్, స్టేషనరీ కొనుగోలుకు రూ.25 వేలు విరాళంగా అందజేశారు. గత కొన్నేళ్లుగా ప్రతి విద్యా సంవత్సరానికి మహేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు డబ్బులు సమకూర్చుతున్నందుకు వారికి గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ ముదిగొండ శివప్రసాద్‌కు సత్కారం

వనస్థలిపురం: వేదభూమి సంస్థ ఆధ్వర్యంలో గురుపూర్ణిమ సందర్భంగా ఆదివారం రాత్రి వనస్థలిపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆచార్యుడు, కవి, పండితుడు, చారిత్రక నవలా చక్రవర్తి డాక్టర్ ముదిగొండ శివప్రసాద్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. శ్రీరంగాచార్య, కె.లక్ష్మయ్య, ఎంఎస్‌కే ప్రభు, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి పలకల అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాధారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం పలకలు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీల్లో చిన్నారులకు ప్రభుత్వం నాణ్యమైన ఆహారం, విద్యా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు పవన్, దర్శన్ లడ్డా, సురేశ్, నవాజ్, హాజీ బాబా, జహంగీర్ ఉన్నారు.

పాత బ్రాహ్మణపల్లిని మాడ్గులలోనే ఉంచాలి

ఆమనగల్లు: పాత బ్రాహ్మణపల్లిని నూతనంగా ఏర్పాటు చేసే ఇర్విన్ మండలంలో కలపకుండా మాడ్గుల మండలంలోనే ఉంచాలని పాత బ్రాహ్మణపల్లి సర్పంచ్ పులికంటి లక్ష్మయ్య కోరారు. హైదరాబాద్‌లో సోమవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు కలిసి వినతిపత్రం అందించారు.

డంపింగ్ యార్డుగా రహదారి

దారంతా దుర్వాస..
వాహనదారుల ఇబ్బందులు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ చౌరస్తా నుంచి బడంగ్‌పేట ముఖద్వారం వరకు ప్రధాన రహదారిని ఇటీవల రూ.1 కోటి 50 లక్షల వ్యయంతో విస్తరించారు. గతంలో ఒకే మార్గం ఉండటంతో తరచూ ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం రెండు మార్గాలుగా రహదారి అందుబాటులోకి రావడంతో వాహనాల రాకపోకలకు అడ్డంకులు తొలగిపోయాయి. అంతవరకు బాగానే ఉంది. అయితే కట్ట కిందున్న రహదారి పక్కన గుర్తుతెలియని వ్యక్తులు చెత్త వేస్తున్నారు. అధికారులు, శానిటేషన్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో రహదారి డంపింగ్ యార్డుగా మారిపోయింది. అభివృద్ధి చేసి నెలలు కాకముందే రహదారి పక్కన గుట్టలు గుట్టలుగా చెత్త, వ్యర్థాలు, భవనాల శిథిలాలు పెద్ద పెత్తున డంప్ చేస్తున్నారు. వ్యర్థ పదార్థాలు కుళ్లిపోవడంతో దుర్వాసన వెలజల్లుతోంది. రోడ్డుపై వెళ్తున్న ప్రజలతో పాటు వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

తీవ్ర దుర్వాసన

రహదారి పక్కన వ్యర్థ పదార్థాలు వేయడంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. వ్యర్థాలు వేయడంతో కుక్కలు, పందులు అక్కడ చేరి వాహనాలకు అడ్డుగా వెళ్లడంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోతే రహదారి పూర్తిగా డంపింగ్ యార్డుగా మారే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించి, చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రధాన రహదారిపై గుట్టలుగా చెత్త

చెత్తవేస్తే జరిమానా

గుర్తు తెలియని వ్యక్తులు రాత్రివేళ చెత్తను డంప్ చేస్తున్నారు. వారిని గుర్తించి జరిమానా విధిస్తాం. ఇకపై చెత్త వేయకుండా చర్యలు తీసుకోవడంతో పాటు వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

– సీహెచ్.నాగేశ్వర్, కమిషనర్, మీర్‌పేట కార్పొరేషన్

రూ.22 కోట్లతో బడ్జెట్ ఆమోదం

అందరికి సమాన వాటా: మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: బడంగ్‌పేట్ కార్పొరేషన్ రూ.22 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించింది. సోమవారం మేయర్ చిగురింత పారిజాత అధ్యక్షతన జరిగిన సమావేశంలో 32 మంది కార్పొరేటర్లకు ఈ బడ్జెట్ కేటాయించారు. సమావేశానంతరం మేయర్ మాట్లాడుతూ.. జనరల్ ఫండ్ నుంచి నాదర్‌గుల్ ప్రధాన రహదారి వెడల్పు పనులకు, అలాగే గ్రావేల్ మెట్‌పిక్స్, కరెంట్ పోల్స్ ఎత్తివేతకు, వైకుంఠధామాలకు అదనంగా మరో రూ.1.30 లక్షలు కేటాయించామని పేర్కొన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లో మౌలిక వసతుల కోసం నిధులను ఖర్చుచేసి అభివృద్ధి బాటలు వేస్తున్నామని తెలిపారు. మేయర్ హోదాలో అన్ని పార్టీలను సమానంగా చూస్తున్నామని ప్రకటించారు. బీజేపీ కార్పొరేటర్లు కావాలనే రాజకీయం చేస్తున్నారని మేయర్ తప్పుబట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమీషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి, మేనేజర్ నాగేష్, ఆర్వో చంద్రశేఖర్‌రెడ్డి, డీఈఈ అశోక్‌రెడ్డి, జ్యోతి, కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించిన బీజేపీ

బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ కార్పొరేటర్ల నిధుల కేటాయింపుపై మొదటి సెషన్ ప్రశాంతంగా సాగింది. అయితే మధ్యాహ్నం తర్వాత జరిగిన సమావేశం రసాభాసగా మారింది. బీజేపీ కార్పొరేటర్లు తమ డివిజన్లకు తక్కువ నిధులు కేటాయించారని ఆందోళనకు దిగారు. మొదటి నుంచి తమ డివిజన్లకు వివక్షత చూపుతున్నారని కౌన్సిల్ బహిష్కరించి కార్యాలయం బయట ధర్నాకు దిగారు. బీజేపీ సభ్యులు సమావేశాన్ని బహిష్కరించినా సమావేశాన్ని యథావిధిగా కొనసాగించారు.



సమావేశంలో చర్చిస్తున్న కార్పొరేటర్లు

సీఎం సహాయనిధి పేదలకు వరం



సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న సబిత

విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సిరిగిరిపురం గ్రామానికి చెందిన ఆవ ప్రవీణ్, దయ్యాల మల్లేష్ చిట్టి శేఖర్, సత్యనారాయణ నలుగురు లబ్ధిదారులకు రూ.96 వేల సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలుంటే కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకొని సీఎం సహాయనిధి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాములు, బీఆర్ఎస్ మండల యూత్ కార్యదర్శి నర్సింహ, నాయకులు సత్యనారాయణ, చారి, మల్లేష్,యాదయ్య పలువురు పాల్గొన్నారు.

23న వనస్థలిపురం సంక్షేమ సంఘం ఎన్నికలు

వనస్థలిపురం: వనస్థలిపురం నివాసుల ఫేజ్–1, 2 సంక్షేమ సంఘం ఎన్నికలను ఈ నెల 23న నిర్వహిస్తామని ఎన్నికల అధికారి కె.మహదేవ్, సహాయ ఎన్నికల అధికారి ఎస్.జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న ఓటర్ల జాబితా విడుదల, 9 నుంచి 12వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 13న నామినేషన్ల ఉపసంహరణకు గడువు, 14న పోటీలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన చేస్తామన్నారు. అసోసియేషన్ హాల్‌లో ఈనెల 23వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటింగ్, అనంతరం మధ్యాహ్నం 3.30 నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తామన్నారు.

'హామీలు నెరవేర్చాలి'

కడ్తాల్: రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని కోరుతూ సేవాలాల్ సేన నాయకులు సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ తిరుపతిరావును కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజనబంధు, గిరిజన బీమా ఇవ్వాలని, ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని, సంత్ సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని, అర్హులైన గిరిజనులకు గృహలక్ష్మి పథకం కింద రూ.10 లక్షలు అందించాలని, నూతనంగా ఏర్పడిన గిరిజన గ్రామ పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించి, ప్రత్యేక అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. లేని పక్షంలో గిరిజనులతో కలిసి కలెక్టరేట్ ఎదుటు ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. జిల్లా సేవాలాల్ సేన అధ్యక్షుడు నరేశ్‌నాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం రాథోడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌నాయక్, ఉన్నారు.

చర్యలు తీసుకోండి



వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాసులు

హస్తినాపురం: ఉన్నత విద్యాసంస్థల్లో ఉల్లంఘనలకు పాల్పడుతూ విద్యార్థుల జీవితాలతో చలగాటమాడుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కార్పొరేట్ విద్యానియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రిని కలిసిన ఆయన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించని, అధ్యాపకులకు వేతన సిఫార్సుల ప్రకారం జీతాలు చెల్లించని ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, టెక్నికల్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇచ్చారు.

హనుమయ్య మృతి పార్టీకి తీరని లోటు

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

తుక్కుగూడ: హనుమయ్య మరణం సీపీఐ పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. సోమవారం తుక్కుగూడ సర్దార్‌నగర్‌లో హనుమయ్య మృతదేహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమయ్య జీవితం కాలం నిరుపేదల సంక్షేమం, కార్మికుల హక్కుల కోసం పోరాటం చేశారని పేర్కొన్నారు. ఆయన సేవలు మరువలేమన్నారు. వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుదన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీంద్రాచారి, సాయిగౌడ్, పర్వతాలు, సయ్యద్ అప్సర్, యాదయ్య, దత్తు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



హనుమయ్య పార్థివదేహానికి పూలమాలలు వేస్తున్న సీపీఐ నాయకులు

కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు



ఎమ్మెల్యే మంచిరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

మంచాల: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని చిత్తాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నేతలు రమేష్, శ్రీను, పిట్టల మహేష్, మరికొంత మంది.. ఎమ్మెల్యే మంచిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి నేతలు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికి గుర్తింపు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, వైస్ చైర్మన్ యాదయ్య, నాయకులు జంగారెడ్డి, సత్యనారాయణ, శ్రీశైలం, కృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని కర్కల్‌పహడ్ గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ 8మంది బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. వాస్‌దేవ్‌పూర్ గ్రామానికి చెందిన కోంటికి రూ.లక్ష, రావిచేడ్ గ్రామానికి చెందిన కరుణాకర్‌రెడ్డికి రూ.22 వేలు, సాయితేజకు రూ.28 వేలు, సాలార్‌పూర్ గ్రామానికి చెందిన దేశిరాంకు రూ.42 వేలు, సరోజకు రూ.16వేలు, శశికళకు రూ.26 వేలు, కడియాతండాకు చెందిన లలితకు రూ.45 వేలు, మౌనికకు రూ.49 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్ నాగమణి, తులసీరాంనాయక్, పూజ, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, రైతు బంధు మండల అధ్యక్షుడు వీరయ్య, నాయకులు వెంకోబా, ఎల్లాగౌడ్, దేవానాయక్ ఉన్నారు.

ఉపాధి బకాయిలు చెల్లించండి

సీఐటీయూ నాయకుడు పాండు డిమాండ్

మంచాల: పెండింగ్‌లో ఉన్న ఉపాధిహామీ పథకం బిల్లులు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు గ్యార పాండు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మంచాల మండలంలోని చెన్నారెడ్డి గూడ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కొన్ని వారాల నుంచి ఉపాధి హామీ కూలీలకు కూలీ డబ్బులు రావడం లేదని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే కూలీలకు సంబంధించిన డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేష్, చంద్రయ్య, పాండు, భాస్కర్, పార్వతాలు, స్వామి, ప్రహ్లాద్, ప్రవీణ్, జంగయ్య, యాదయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కూలీలు

మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు సరికావు

బడంగ్‌పేట్: మంత్రి సబితారెడ్డిపై బీజేపీ కార్పొరేటర్లు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆక్షేపించారు. సోమవారం బడంగ్‌పేటలో ఫ్లోర్‌లీడర్ ఎస్ అర్జున్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ నిధులకు మంత్రికి ఎలాంటి సంబంధం లేకున్నా బీజేపీ కార్పొరేటర్లు నిరసన వ్యక్తం చేయడం సరికాదన్నారు. మున్సిపల్ కొత్త చట్టాలపై అవగాహన లేకుండా కావాలనే విమర్శలు చేయడం బీజేపీ సభ్యులకే చెల్లిందని దుయ్యబట్టారు. బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయని విమర్శించారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లకు నిధులు వెచ్చించకుండా బీజేపీ, కాంగ్రెస్ డివిజన్లలోనే మేయర్ నిధులు కేటాయించారని విమర్శించారు. కావాలనే ఎజెండాను అడ్డంపెట్టుకుని బీజేపీ సభ్యులు కౌన్సిల్‌ను బైకాట్ చేశారని ఆరోపించారు. మంత్రి సబితపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు శ్రీనివాస్‌రెడ్డి, పవన్‌కుమార్, ఏ రాంరెడ్డి, శివకుమార్, పి.శోభ, మమత, స్వప్న, సంరెడ్డి స్వప్న, లలిత, దీపికారెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు



వేడుకలను తిలకిస్తున్న ముఖ్యులు, డీపీఎస్ స్కూల్ చైర్మన్ కొమురయ్య

కల్నల్ అనిల్‌కుమార్

బడంగ్‌పేట్: ఎన్‌సీసీలో శిక్షణ తీసుకున్న విద్యార్థులకు పట్టుదల, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని కల్నల్ అనిల్ కుమార్ అన్నారు. సోమవారం బడంగ్‌పేట్‌లోని నాదర్‌గుల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఇన్వెస్టిచర్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కల్నల్ అనీల్‌కుమార్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఐఆర్ఎస్ అధికారి ఎస్.బలరాం, పల్లవి గ్రూప్, ఢిల్లీ పబ్లిక్ చైర్మన్ మర్కా కొమురయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీ వల్ల ధైర్యం, పట్టుదల, క్రమశిక్షణ, పోటీతత్వం పెంపొందుతాయన్నారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్ వల్ల ఉద్యోగాలు కూడా వస్తాయన్నారు. విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యారంగ నిపుణులు కొమరయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఓఓ మల్క యశస్వి, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఎల్‌బీనగర్: నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్ల ప్రధాన రహదారుల పక్కన హంగూ ఆర్భాటాలతో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్స్ మౌలిక సదుపాయాలు లేక దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయని ఎల్‌బీనగర్ బీఎస్‌పీ ఇన్‌చార్జి జక్క యాదగిరి అన్నారు. సోమవారం ఆయన రహదారుల పక్కన ఏర్పాటు చేసిన పలు పబ్లిక్ టాయిలెట్స్‌లో నీటి సరఫరా, విద్యుత్ లేమి, పరిసరాలలో పడకేసిన పారిశుద్ధ్యం, ముక్కుపుటలు అదిరే దుర్గంధ వంటి సమస్యలను పరిశీలించారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ సర్కిల్ అధికారులు స్పందించి ప్రతీ పబ్లిక్ టాయిలెట్‌ల్లో మౌలిక సదుపాయలు కల్పించాలని, వాటి నిర్వహణపై నిర్లక్ష్యం చేస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుమార్, అనిల్, అశోక్ పాల్గొన్నారు.



పబ్లిక్ టాయిలెట్‌ని పరిశీలిస్తున్న యాదగిరి

వైభవంగా గురు పౌర్ణమి



దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి సబితారెడ్డి

కందుకూరు: మండలంలోని శ్రీ నిఖిల్ చేతనా కేంద్రంలో బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి ఉత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీనిఖిలేశ్వరానందస్వామి విగ్రహానికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గురూజీ మాట్లాడుతూ..అనితర సాధ్యమైన పనులను కూడా సుసాధ్యం చే సుకోవడానికి సాధనను మించిన మార్గం మరొకటి లేదన్నారు. భక్తితో చేసే సాధనలు సత్ఫలితాలు ఇస్తాయన్నారు. అందరూ సన్మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. వివిధ రాష్ట్రాలు, ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి

బడంగ్‌పేట్: గురుపౌర్ణమి సందర్భంగా బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని అన్ని సాయిబాబా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఇష్టదైవానికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత దంపతులు నాదర్‌గుల్‌లోని సాయిబాబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పి.సుదర్శన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్‌రెడ్డి, నాయకులు ఆనంద్‌రెడ్డి, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



పూజల్లో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి



బడంగ్‌పేట్: నాదర్‌గుల్ సాయిబాబా ఆలయం పూజలు చేస్తున్న మేయర్

సాయిబాబా పీఠంలో గురుపూర్ణిమ పూజలు

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంతి హిల్స్ ద్వారకామయి సాయిబాబా పీఠంలో గురుపూర్ణిమ సందర్భంగా గోపాలకృష్ణానంద స్వామిజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మాజీ ఐపీఎస్ అధికారి జానకి ఆర్ కొండపి, వనం రంగయ్య, మాజీ సర్పంచ్ పాండుగౌడ్, తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



కందుకూరు: స్వామి నిఖిలేశ్వరానంద పాదుకలకు పూజలు చేస్తున్న గురూజీ